రామానుజ తిరునక్షత్ర మహోత్సవాలు



గౌడవెళ్లిలో రథోత్సవం

మేడ్చల్ : రామానుజ జయంతి సందర్భంగా గౌడవెళ్లి గ్రామంలో తిరునక్షత్ర మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రామానుజ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈనెల 28న ప్రారంభమైన ఉత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. విష్ణుసహస్ర నామార్చన, వివిధ ప్రత్యేక పూజలు, వివిధ రకాల పల్లకీసేవలు, రథోత్సవం వంటి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రామంలో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. ఉత్సవాల్లో భక్తులతో పాటు గ్రామానికి చెందిన ప్రముఖులు, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ రందీప్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కీసర: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న జాతీయ జనగణన, కులగణన (క్యాస్ట్‌సెన్సస్)ను స్వాగతిస్తూ.. శనివారం రాంపల్లి చౌరస్తాలో నాగారం మున్సిపల్ బీజేపీ శాఖ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..



ఘట్‌కేసర్: దేశంలో జనగణనతో పాటు కులగణన చేపడతామని నిర్ణయం తీసుకున్న కేంద్రం నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ.. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దివాకర్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. బాలరాజ్‌ముదిరాజ్, శోభారాణి, నర్సింహ, మహేష్, అంజనేయులుగౌడ్, శంకర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, పవన్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్, రామోజీ, శ్రీరాములు, లక్ష్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, మధుగౌడ్, కిశోర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, మమతశర్మ, సోని పాల్గొన్నారు.

పేదలకు విద్య అందేనా..?

- హైకోర్టు ఆదేశాలతో నిరుపేద కుటుంబాల్లో ఆశలు
- నగరంతో సహా శివారు జిల్లాల్లో 5,094 ప్రైవేట్ స్కూల్స్
- లక్ష మందికి పైగా పేద విద్యార్థులకు అందనున్న ఉచిత విద్య

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు నిరుపేదలు, దివ్యాంగులకు కేటాయించి ఉచిత విద్యను అందించాలని నిబంధనలు చెబుతున్నాయి. వాటి అమలు మొన్నటి వరకు కాగితాల్లో లెక్కలకే పరిమితమైంది. తాజాగా 2025 జూన్ నుంచి అమలు చేస్తామని హైకోర్టుకు ప్రభుత్వం లిఖితపూర్వకంగా తెలిపిన నేపథ్యంలో విధివిధానాల తయారీకి కసరత్తు మొదలు పెట్టింది. దీంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇన్నాళ్లూ దక్కని హక్కు ఇక తమకు చేరబోతుందనే సంతోషం బలహీన వర్గాల కుటుంబాల్లో కనిపిస్తోంది. – సాక్షి, సిటీబ్యూరో



15 ఏళ్లుగా నిరీక్షణ..

2009లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయగా.. సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 25 శాతం మంది పిల్లలను చదివించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఉచిత నిర్బంధ విద్యలో భాగంగా ఈ చట్టాన్ని పక్కాగా కార్యాచరణలో చూపించాల్సి ఉంటుంది. జీవో 44 ప్రకారం అనాథలు, ఎయిడ్స్ బాధిత చిన్నారులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లు అందించాలని అప్పట్లోనే నిర్ణయించారు. అయినా ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు.

అధిక ఫీజులతో అవస్థలు..

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మాత్రం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం ముక్కుపిండి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. టెక్నో, కార్పొరేట్ పాఠశాలల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు, డొనేషన్లకు లెక్కలేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యాహక్కు చట్టం అమలైతే..

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో మొత్తంగా 8,029 వరకు పాఠశాలలు ఉండగా.. ఇందులో 5,094 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రైవేట్ పాఠశాలల్లో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 1,611 ఉండగా.. రంగారెడ్డి జిల్లాలో 1,581, హైదరాబాద్ జిల్లాలో 1,902 ఉన్నాయి. ఈ ప్రైవేట్ పాఠశాలల పరిధిలో వందలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించి చదువుకొంటున్నారు'.

పేదలకు చేరువగా విద్య..

ఒక్కో ప్రైవేటు పాఠశాలలో కనిష్ఠంగా 200 నుంచి గరిష్ఠంగా 1000 మంది విద్యార్థుల వరకు చదువుతున్నారు. అందులో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తే.. గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో లక్ష నుంచి రూ.1.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉండగలదని పేర్కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలలు ఇకపై ఉచితంగా సీటు పొందిన విద్యార్థి పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది.

చీర్యాలకు నూతన బస్సు సర్వీసు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న రామగుండం ఎమ్మెల్యే తదితరులు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ నుంచి చీర్యాల లక్ష్మీనృసింహ దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందని, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజు ఠాగూర్ అన్నారు. శనివారం చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, దేవాలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణతో కలిసి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే యాత్రికులు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, డైరెక్టర్ ఈగ శ్వేతానాగరాజు, మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సోమేష్, శోభారాణి, సునీత, కృష్ణయాదవ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం వైపు ఆర్టీసీ కొత్త అడుగులు!

కలెక్షన్ వచ్చే ప్రతి రూటుకు ప్రాధాన్యతనిస్తున్న ఆర్టీసీ



మేడ్చల్: ఓ వైపు ప్రైవేటు వాహనాల జోరు.. మరో వైపు ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులకు కలెక్షన్ తగ్గడంతో మేడ్చల్ ఆర్టీసీడిపో అధికారులు కొత్త ఆలోచనలు చేస్తూ.. ఆదాయం పెంచే దిశలో అడుగులు వేస్తున్నారు.

స్పెషల్ బస్సులు..

పండగలు, జాతర సమయాల్లో 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఉండే ఇంటికొచ్చి ఇంటి నుంచే బస్సులలో ఎక్కించుకుని, గమ్యస్థానాలకు తీసుకెళ్లే ప్రక్రియను ఆర్టీసీ 6 నెలల క్రితం ప్రారంభించింది. పాత స్కీమ్‌లకు నూతన ఆలోచనలు జోడించి కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. తీర్థయాత్రలకు తీసుకెళ్లడం, దేవాలయాల దర్శనం కోసం ప్రత్యేకంగా బస్సులు నడపడం వంటి పనులు చేస్తూ కలెక్షన్లను పెంచుతున్నారు. ఇప్పటికే లాజిస్టిక్ వ్యాపారం మొదలుపెట్టి సఫలమైన అధికారులు ప్రతీ చిన్న వస్తువును ట్రాన్స్‌పోర్ట్ చేయడానికి సుముఖత చూపుతున్నారు.

నూతన ఆలోచనలతో..

మేడ్చల్ డిపో అధికారులు భక్తులకు సౌకర్యం అంటూనే నూతన ఆలోచనలతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. మేడ్చల్ నుంచి భువనగిరి వరకు వివిధ పుణ్యక్షేత్రాల వరకు ప్రతీ ఆదివారం బస్సులు నడుపుతూ.. స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకుంటుంది. మేడ్చల్ శివార్లలో ఉన్న దక్షిణ బద్రీనాథ్ ఆలయం, సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతీ అమ్మవారి గుడి, కొమురవెల్లి మల్లన్నగుడి, అలియాబాద్ వేంకటేశ్వరస్వామి ఆలయం, చీర్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, భువనగిరి స్వర్ణగిరి ఆలయం వరకు ప్రతీ ఆదివారం బస్సులు నడుపుతోంది. ఈ బస్సులో ఆధార్‌కార్డు ప్రయాణం అనుమతించకుండా పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 టికెట్ ధరగా నిర్ణయించి ప్రయాణం చేయిస్తున్నారు. మూడు జిల్లాల పుణ్యక్షేత్రాల పర్యటన రూ.500గా నిర్ణయించడంతో మంచి ఫలితాలు సాధిస్తుంది.

రద్దీ సమయాల్లో ఏసీ బస్సులు..

కలెక్షన్ల కోసం రద్దీ సమయాల్లో మేడ్చల్ నుంచి అధికారులు ఏసీ బస్సులు నడిపిస్తున్నారు. ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి లేకపోవడం రద్దీగా ఉండటంతో ప్రయాణికులు ఆ బస్సుల వైపు చూపుతుండటంతో వసూళ్లు బాగానే పెరుగుతున్నాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతతో జాగ్రత్త !

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి,సిటీబ్యూరో: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో అత్యవసర పనులు ఉంటే తప్పా... బయటికి వెళ్లొద్దని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ.. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలివేంద్రాలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి తాగునీటిని, చలివేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాలకు ఏఎన్ఎం, ఆశవర్కర్లతో పంపిణీ చేయించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి శీతలపానీయాలు కాకుండా తాగునీళ్లు, ఓఆర్ఎస్ కలిపిన నీళ్లు వెంటనే తాగించాలని, నీడ ఉండే ప్రదేశాల్లో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రదేశాల్లో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూగజీవాలు, పక్షులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని రామభక్త ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. వేదపండితులు కలగ సంపత్‌శర్మ, వెంకటేష్‌శర్మల ఆధ్వర్యంలో మూర్తిజుల పాటు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

ఫంక్షన్‌హాల్‌లో అగ్నిప్రమాదం

ఘట్‌కేసర్: పట్టణంలోని ఎస్ఎం ఫంక్షన్‌హాల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. శనివారం గాలి దుమారానికి విద్యుత్ స్తంభాల కేబుల్ తెగిపోయి పెళ్లి డెకరేషన్ సామగ్రిపై పడటంతో మంటలకు ఆహుతైంది. సుమారుగా రూ. 50 వేల డెకరేషన్ వస్తువులు మంటలకు కాలిబుడిదైందని బాధితులు వాపోయారు.

జెడ్పీ బాలుర పాఠశాలలో వేసవి శిబిరం

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, గేమ్స్, మ్యాథ్స్‌స్కిల్స్, డ్రాయింగ్, పెయింటింగ్‌లో శిక్షణనిస్తున్నారు. జెడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి శనివారం వేసవి శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించారు. మే 15 వరకు శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ముగింపురోజున ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని హెచ్ఎం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పోచారం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టు అఖిల్ (27) డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం యంనంపేట్ నుంచి పోచారంలోని స్టోర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. జోడిమెట్లలోని పరంపర రెస్టారెంట్ వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ అర్చకుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి



జవహర్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న దివ్యాంగులు

జవహర్‌నగర్: బాలాజీనగర్ పాతబస్తీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో దివ్యాంగుడైన అర్చకుడిని కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారని, నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సమితి ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం జవహర్‌నగర్ ప్రధాన రహదారి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతనెల 15న దివ్యాంగుడైన అర్చకుడు జితేందర్‌శర్మపై దాడి జరిగిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. పరిష్కరించలేదని, అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ నాయకులు అండదండలతో దివ్యాంగుడిపై దాడి చేసిన కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని ఆరోపించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేదంటే సీఎం క్యాంప్ ఆఫీస్‌లో వందలాది మంది దివ్యాంగులతో న్యాయం జరిగేంత వరకు ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర వికలాంగుల సమితి గౌరవ అధ్యక్షులు వంగ శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల నేస్తం ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బత్తిని బిక్షపతిగౌడ్, రమేష్, శ్రీనివాస్‌బాబు, ధనరాజ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

మేడ్చల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలం పంటసాగుకు రైతులను సమయాత్తం చేసేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందించిందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పంట సాగుబడి, పాడిపంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలో రైతులు ఇప్పటికే వర్షాకాలం పంటసాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఎరువుల వినియోగంతో ఆర్థికంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా చైతన్య కార్యక్రమాలను నిర్వహించటానికి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. పంట సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కార మార్గం లభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో సోమవారం నుంచి జూన్ 16 వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రత్యేక పాలనలో గ్రామ కార్యదర్శుల చేతివాటం!

- మున్సిపల్ వార్డులుగా మారనున్న గ్రామాలు
- అధికారులు అక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు

పట్టణీకరణలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని 61 గ్రామాలను నూతన మున్సిపాలిటీలు మారుస్తూ గెజిట్‌లు విడుదల చేయడంతో గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మేడ్చల్: నియోజకవర్గంలో ఎల్లంపేట్, అలియాబాద్, మూడు చింతలపల్లిలను మూడు నూతన మున్సిపాలిటీలుగా మారుస్తూ.. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటనలు విడుదల చేసింది. పూర్తిగా మున్సిపల్ పాలన వచ్చేంత వరకు ప్రభుత్వం గ్రామాలను మున్సిపాలిటీలు ఇంత వరకు పంచాయతీరాజ్‌శాఖ ఆధీనంలోనే ఉంచుతూ.. గ్రామాలలో గ్రామకార్యదర్శుల పాలనే సాగిస్తుంది. వార్డుల విభజన, ఆస్తుల విభజన, మున్సిపల్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలతో బిజీగా ఉండటంతో మున్సిపాలిటీలుగా మారుతున్న గ్రామాలు ఇప్పటి వరకు పంచాయతీరాజ్ పాలనలోనే ఉన్నాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం 6 నెలల క్రితమే ముగియడంతో గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన సాగుతుంది. గ్రామానికి గ్రామకార్యదర్శి బాస్‌లా ఉండగా.. ప్రత్యేకాధికారి ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

అభివృద్ధి మాట దేవుడెరుగు.. అన్ని అక్రమాలే..

మున్సిపల్ పాలన మొదలైన తొలిరోజే గ్రామ కార్యదర్శుల ఆఖరిరోజు. ప్రభుత్వం వారికి ఇచ్చే ఆప్షన్లను బట్టి వారు మున్సిపల్ వ్యవస్థలో కొనసాగుతారా.. లేదా వారి మాతృసంస్థలకు వెళ్తారా.. అనేది వారి నిర్ణయం పైనే ఉంటుంది. ప్రభుత్వం మున్సిపల్ కోసం ముమ్మరంగా కసరత్తు చేస్తుండటంతో గ్రామకార్యదర్శులు సంపాదన కోసం కసరత్తులు చేస్తున్నారు.

- ◆ మేడ్చల్ నియోజకవర్గం హైదరాబాద్ నగరానికి శివార్లలో ఉన్నది కావడంతో ఇక్కడ అన్ని వ్యాపారాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- ◆ గోదామ్‌ల నిర్మాణం, నూతన ఇళ్ల నిర్మాణం, వ్యాపార సంస్థల నిర్మాణం, షెడ్ల నిర్మాణం వంటివి గ్రామాల్లో ఎటు చూసినా అధికంగా కనిపిస్తున్నాయి. వివిధ రకాల కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనులను పరిష్కరించకుండానే గ్రామాల్లో ఉండే నాయకులకు అనుకూలంగా పనులు చేయడం వంటివి జోరుగా నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి.
- ◆ ప్రధానంగా కమర్షియల్ వ్యాపారాలు, పరిశ్రమలు, గోదామ్‌లు, అద్దెలకు భలే గిరాకీ ఉన్న గ్రామాల్లో అధికంగా నడుస్తున్నాయి. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు దీని గురించి తెలిసినా ఎవరికి చెందాల్సింది వారికి చెందుతుండటంతో గ్రామాల్లో కార్యదర్శుల హవా జోరుగా కొనసాగుతుందనే వాదనలు అధికంగా వినిపిస్తున్నాయి.

నేటి 'నీట్'కు పకడ్బందీగా ఏర్పాట్లు

- మేడ్చల్ జిల్లాలో ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్
- 13 పరీక్షా కేంద్రాలు, 4,336 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, విస్తృత తనిఖీలు

సాక్షి,సిటీబ్యూరో: వైద్య కళాశాలల్లో (ఎంబీబీఎస్, బీడీఎస్) ప్రవేశాలకు నేడు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-2025 (నీట్)కు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 4,336 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరకు పరీక్ష జరగనుంది. దివ్యాంగులకు ఓ గంట అదనపు సమయం ఉంటుంది. జిల్లాతో పాటు పొరుగు జిల్లాల వారు కూడా ఇక్కడ పరీక్ష రాయనున్నారు. ఉదయం 11 నుంచే కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థులకు కలెక్టర్ సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

పోలీసు బందోబస్తు..

ప్రతీ పరీక్ష కేంద్రానికి తహసీల్దారు డ్యూటీ మేజిస్ట్రేట్లుగా నియమించారు. గతేడాది నీట్ ప్రశ్నాపత్రం లీక్, అవకతవకలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీట్ నిర్వహణపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. దీనిలో భాగంగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పోలీసులు నీట్‌కోసం భారీ బందోబస్తు, ముమ్మర తనిఖీలు చేయనున్నారు. పోలీస్ ఎస్కార్ట్ ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర కీలకసామగ్రిని కేంద్రాలకు తరలించనున్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో..

అన్ని పరీక్ష కేంద్రాలలో మెడికల్ కిట్లు, అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. పరీక్షాకేంద్రాలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి వసతులు ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగుల అభ్యర్థులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు.

అనుమతి నిరాకరణ..

పరీక్ష కేంద్రాల్లోకి తాగునీళ్ల బాటిల్, ఆహార పదార్థాలను అనుమతించరు. అనారోగ్యంతో ఉన్నట్లు ఆధారాలు సమర్పిస్తే మందులు, పారదర్శకమైన నీటి బాటిళ్లను అనుమతిస్తారు. ఉంగరాలు, బ్రాస్‌లెట్లు, చెవిపోగులు, ముక్కు పుడకలు, గొలుసులు, నెక్లెసులు, హెయిర్‌పిన్, హెయిర్ బ్యాండ్, తాయత్తులు, పర్సులు, హ్యాండ్‌బ్యాగులు, బూట్లు, పొడువు చేతుల చొక్కాలు, చేతిగడియారాలు, పెన్ను, పెన్సిల్, రబ్బరు, కాగితాలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని అధికారులు పేర్కొన్నారు. పరీక్ష రాసేందుకు అవసరమైన పెన్నును కేంద్రంలోనే ఇస్తారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు కేంద్రం నుంచి బయటకు వెళ్లనివ్వరు. నిబంధనలు బేఖాతరు చేస్తే మూడేళ్ల వరకు డిబార్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. అడ్మిట్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్, ఓటరు గుర్తింపు, పాన్ కార్డు వంటివి ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది.

నెగెటివ్ మార్కులు..

ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులను కేటాయిస్తారు. నెగెటివ్ మార్కులు ఉన్నందున తెలిసిన సమాధానాలే రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. సమాన మార్కులు వస్తే.. నెగెటివ్ మార్కులు తక్కువ ఉన్న వారికే ర్యాంకులో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ ర్యాంకు ద్వారా దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, బీవీఎస్, ఏహెచ్ సీట్లతో పాటు ఎయిమ్స్ సీట్లను భర్తీ చేస్తారు.